క్లుప్తంగా

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు



కాలభైరవ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం: అమావాస్యను పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెం శ్రీ గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో వేంచేసి ఉన్న కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి ప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, భాస్కరశర్మలు భక్తుల పేరిట ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షులు డాక్టర్ బోర వెంకట రమణారెడ్డి, శరకం సత్యారావు, బోర యర్రాజీరెడ్డి, ఇతర సంఘం సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కనకమ్మ జాతర విజయోత్సవం



కార్పొరేటర్ మువ్వల లక్ష్మిని సత్కరిస్తున్న జాతర కమిటీ సభ్యులు

బీచ్‌రోడ్డు: చిన్నవాల్తేరు కనకమ్మ తల్లి జాతర మహోత్సవం విజయవంతంగా పూర్తి కావటంతో జాతర నిర్వాహకులు మంగళవారం విజయోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర నిర్వహణకు ప్రోత్సాహం అందించిన 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి సురేష్‌ను, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జీవీ రామచంద్రరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు కుమార్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో రైల్వే పోలీసులు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ పీఆర్ బిషోయి, జీఆర్‌పీ ఎస్‌ఐ అబ్దుల్ మారూఫ్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా తమిళనాడుకు చెందిన పుగాజ్హేంది తమిళనాడుకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడాన్ని గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని, రూ. 35 వేల విలువైన 7 కేజీల గంజాయిని సీజ్ చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

దళితులపై దాడులు దారుణం



మాట్లాడుతున్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్

సీతంపేట: దళితుల బడ్జెట్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరని అన్యాయం చేశాయని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ జిల్లాలో మూడు లక్షల మంది ఎస్సీ జనాభా ఉంటే, ఎస్సీ కార్పొరేషన్ యూనిట్లు కేవలం నాలుగు వందల యూనిట్లు కేటాయించడం సిగ్గుచేటని మండిపడ్డారు. మంత్రులు ఉన్న నియోజకవర్గాలలో దళితులపై దాడులు విపరీతంగా జరుగుతున్నాయని, పిఠాపురం, పాయకరావుపేట, తెనాలి నియోజకవర్గాల్లో దళితులపై దాడులు జరిగాయన్నారు. దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసారు. దళితుల రక్షణకు ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజులు, గుడాల రాంబాబు, పిల్లి వీర్రాజు, ఎస్‌ఏడీ రాజ్, శ్రీనివాస్, పిల్లి రాము, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే.. బీఆర్‌టీఎస్ ఇంతే..



చెరువును తలపిస్తున్న రహదారి

- చెరువును తలపిస్తున్న రహదారి
- రూ.కోట్లు వెచ్చించినా కానరాని ప్రయోజనం
- పెదగదిలి వద్ద తరచూ నిలిచిపోతున్న నీరు
- వాహనచోదకుల అవస్థలు

ఆరిలోవ: ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బీఆర్‌టీఎస్ రోడ్డు వర్షం పడితే చెరువును తలపిస్తోంది. నిర్మాణం పూర్తయి దశాబ్దానికి పైగా గడిచినా, ఇక్కడి సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. వర్షం పడితే చెరువులా మారిన రోడ్డుపైనే వాహనచోదకులు ప్రయాణించాల్సి వస్తోంది. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో సమస్య తప్పదంటూ వాహనచోదకులు, స్థానికులు నిట్టూర్పుతున్నారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి ఇక్కడ నీరు నిల్వ ఉండిపోయి వాహనచోదకులు ఇబ్బందిపడ్డారు. మంగళవారం సాయంత్రం కూడా అదే పరిస్థితి నెలకొంది.

రూ.200 కోట్లు వెచ్చించినా..

హనుమంతవాక నుంచి అడవివరం వరకు విశాలమైన బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మించారు. హనుమంతవాక నుంచి పైనాపిల్ కాలనీ వరకు ఐదు లేన్లు, పైనాపిల్‌కాలనీ నుంచి అడవివరం కూడలి వరకు మూడు లేన్లతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ట్రావెల్ బస్‌లు, భారీ వాహనాలు, వీవీఐపీ వాహనాలు నగరంలోకి ప్రవేశించకుండా ఈ రోడ్డును ఉపయోగించే విధంగా శీఘ్ర రవాణా వ్యవస్థ పేరుతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ సంయుక్తంగా 2008లో ఈ నిర్మాణం చేపట్టారు. ఇంజినీరింగ్ నైపుణ్యం ఉపయోగించి ఎంత వర్షం కురిసినా చుక్క నీరు కూడా ఒక్క నిమిషం పాటైనా రోడ్డు మీద నిల్వ ఉండకుండా ఈ నిర్మాణం చేపట్టదలచారు. దీనికి అప్పట్లో రూ.200 కోట్లు ఖర్చు చేశారు. ఇన్ని రూ.కోట్లు ఖర్చు చేసి చేపట్టిన ఈ నిర్మాణం పెదగదిలి వద్ద బెడిసి కొట్టేసింది. చిన్నపాటి వర్షం కురిసినా పెదగదిలి కూడలిలో వరద నీరు గంటల తరబడి నిల్వ ఉండిపోతుంది. భారీ వర్షం కురిస్తే పెద్ద చెరువును తలపిస్తుంది. ఇటీవల రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు ఇక్కడ చేరిన వరద నీటిలో వాహనచోదకులు నానా అవస్థలు పడ్డారు. ద్విచక్రవాహనాల సైలెన్సర్‌లో నీరు చేరిపోయింది. కార్లు, ఆటోలు సీట్ల ఎత్తు వరకు మునిగిపోయాయి. పాదచారులు నడవడానికి వీల్లేకుండాపోయింది.



రెండు రోజుల క్రితం పెదగదిలి వద్ద చేరిన వరద నీరు

వర్షం కురిసిన ప్రతి సారీ ఇదే పరిస్థితి నెలకొంటోందని స్థానికులు, వాహనచోదకులు అంటున్నారు. జీవీఎంసీ అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఇక్కడ రోడ్డు ఎత్తుచేసి కింది నుంచి నీరు పోయే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కొండవాలు నుంచి వరద నీరు

ఇక్కడ కొండవాలు ప్రాంతం ఎక్కువ. వర్షం కురిసినప్పుడు సింహగిరి కాలనీ నుంచి పెదగదిలి వరకు కొండపై నుంచి వచ్చిన వరద నీరు కాలువ ద్వారా పెదగదిలి కూడలిలో చేరిపోతుంది. ఇక్కడి నుంచి రోడ్డు కింద భాగంలో నిర్మించిన కాలువలు ద్వారా విమ్స్ గోడ పక్కన ఉన్న గెడ్డలో చేరుతుంది. కొండవాలు నుంచి కూడలి వరకు చేరిన వరద నీరు గెడ్డలోకి ప్రవహించడానికి సరైన డ్రైనేజీ వ్యవస్థను అధికారులు ఏర్పాటు చేయలేదని నిర్మాణ దశలోనే పలువురు ఆరోపించారు. అయినా అప్పటి జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు వారికి తోచినట్లు పనులు చేసుకుపోయారు. కొండవాలు నుంచి వచ్చిన వరద నీరు కిందకు పోవడానికి డ్రైనేజీ సరిగా లేకపోవడంతో కూడలిలో రోడ్డుపై నీరు పోటెత్తుతోంది. ఇది గంటల తరబడి నిల్వ ఉండిపోవడంతో రోడ్డుపై ప్రయాణించే వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ కూడలి పల్లం కావడంతో నిల్వ ఉన్న వరద నీటిలో ద్విచక్రవాహనాలు, ఆటోలు మునిగిపోతున్నాయి. డోర్లు దాటినంతవరకు కార్లు నీటిలో మునిగిపోతున్నాయి. భారీ వర్షం కురిసినప్పుడు వచ్చిన వరద నీటిని దాటలేక కొన్ని వాహనాలు ఓ వైపు నిలిచిపోతున్నాయి. ఇటీవల రెండు రోజుల పాటు కురిసిన వర్షం, గతేడాది ఏడాది జూన్ మొదటి వారం, జూలై మూడో వారంలో కురిసిన వర్షాలకు ఇక్కడ కూడలి చెరువును తలపించింది. ఈ కూడలిలో రోడ్డు పక్కన నిర్వహించే బడ్డీలు సైతం మునిగిపోతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం జరిగినప్పటి నుంచి ఇదే పరిస్థితి ఉన్నా జీవీఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

> **ఇక్కడ రోడ్డు భాగం ఎత్తు చేయాలి**
>
> పెదగదిలి కూడలిలో రోడ్డు బాగా పల్లంగా ఉంది. దీన్ని ఎత్తు చేసి, గతంలో ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలి. అలా చేస్తేనే కొండవాలు నుంచి వచ్చే వరద నీరు నేరుగా కింద నున్న గెడ్డలోకి చేరుతుంది. అధికారులు దీనిపై చర్యలు చేపడితే బాగుంటుంది.
>
> – ఎం.వెంకటరావు, చినగదిలి

> **బురద చేరిపోతోంది**
>
> వర్షం కురుస్తున్నప్పుడు ఈ కూడలిలో నీరు చేరిపోయి నిల్వ ఉండిపోతుంది. వర్షం తగ్గిన తర్వాత నీరంతా కిందకు పోయిన అనంతరం రోడ్డుమీద బురద చేరిపోతుంది. ఆ బురదలో వాహనాలు జారిపోతున్నాయి. వర్షం తగ్గిన మరుసటి రోజు జీవీఎంసీ అధికారులు వచ్చి పరిశీలిస్తున్నారు. ఇక్కడ కాలువలు, గెడ్డ చూస్తున్నారు. అయినా దీని గురించి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇలా చాలాసార్లు వచ్చి పరిశీంచి వెళ్లారు. ఫలితం మాత్రం ఉండటం లేదు. ఈ రోడ్డుపై రోజులో వేల వాహనాలు తిరుగుతున్నాయి. అధికారులు దీనిపై దృష్టిపెట్టి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి.
>
> – శ్రీనివాసరావు, పెదగదిలి



వాన నీటిలో వాహనచోదకుల అవస్థల ప్రయాణం



నీరు పోయిన అనంతరం, శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

రుతు పరిశుభ్రతపై బాలికలకు అవగాహన



పదో వార్డులో బాలికలతో మ్యాజిక్ బస్ ప్రతినిధులు



పెదజాలరిపేట స్కూల్లో డ్రాయింగ్స్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి బి.ఎస్.ఆర్ నగర్‌లో మంగళవారం మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రుతుచక్ర పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వివేకానందనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాహిత్య మాట్లాడారు. గ్రామంలో బాలికలకు రుతు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఫౌండేషన్ సభ్యులు బాలికలకు అవసరమైన వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ టీఎంవో ఆర్.శంకరరావు, డి.సాయిరాం, యూష్మా, స్వాతి, వెంకటరత్నం, సాయిలక్ష్మి, పాల్గొన్నారు.

19వ వార్డులో..

ఎంవీపీకాలనీ: రుతు చక్ర పరిశుభ్రతపై మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. 19వ వార్డు పెదజాలరిపేట స్కూల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మాట్లాడారు. రుతుస్రావమయ్యే సమయంలో పాటించాల్సిన శుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. కుటుంబ సభ్యులకు దూరంగా ఉండటం వంటి మూఢనమ్మకాలను విడనాడాలని సూచించారు. అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ ప్యాడ్స్‌ను వినియోగించాలన్నారు. ఈ సందర్భంగా రుతుస్రావం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు గీసిన డ్రాయింగ్స్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సురేంద్రకుమార్, పైడి, పైడమ్మలు, దుర్గాభవానీ తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మకు సారె కానుక



బంగారమ్మకు సారె సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో గల బంగారమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రజలు సారె సమర్పించారు. వందలాది మహిళలు సారెను నెత్తిన పట్టుకొని అమ్మవారి దేవాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పల్లా అప్పల కొండ పాల్గొని అమ్మవారికి సారెను ప్రత్యేకంగా సమర్పించారు.

నేడు వైభవ వేంకటేశ్వరాలయ వార్షికోత్సవం

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలోని కోదండ రామాలయంలో శ్రీ వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షిక వేడుకలను బుధవారం నిర్వహించనున్నట్లు గ్రామ సేవాసంఘం అధ్యక్షుడు పీల కనకరాజు మంగళవారం ప్రకటనలో తెలిపారు. బుధవారం వేకువజామున 5 గంటలకు సుప్రభాత సేవ, 7.30 గంటలకు ఆర్చన సేవ, విష్వక్సేన పూజ, భగవత్ పుణ్యాహవచనము, పరిషత్ విజ్ఞాపన, రక్షా సూత్రధారణ, మండపారాధన, అష్టోత్తర శత కలశారాధన, స్వామివారికి అష్టోత్తర శతకలశాభిషేకం, విశేష హోమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం ఐదు గంటల నుంచి శ్రీవారి కల్యాణ మహోత్సవం అనంతరము పుష్పాంజలి, పవళింపు సేవ జరుగుతాయని వివరించారు. పీనపాటి శ్రీనివాస మారుతి రామవన్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రామకృష్ణాచార్యులు పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

యోగా వేడుకల ప్రాంగణం పరిశీలన



యోగా వేడుకలు జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎం.టి.కృష్ణబాబు

ఏయూక్యాంపస్: అంతార్జాతీయ యోగా వేడుకలు జరగనున్న బీచ్ రోడ్డు ప్రాంతాన్ని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మంగళవారం ఉదయం సందర్శించారు. ప్రధాన కార్యక్రమం జరిగే ఆర్కే బీచ్ ప్రాంగణం, ఇతర కంపార్ట్‌మెంట్లు నిర్మించే ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమ ప్రణాళిక, నిర్వహణ విధానాన్ని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ స్వయంగా వివరించారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం



పోస్టర్లు ప్రదర్శిస్తున్న కిశోర బాలికలు

మద్దిలపాలెం: ఆన్‌లైన్ మోసాలు, సైబర్ క్రైమ్‌పై కిశోర బాలికలు అవగాహనతో ఉండాలని కేఆర్‌ఎం కాలనీ–1 అంగన్‌వాడీ కార్యకర్త ఆర్.సుబ్బలక్ష్మి అన్నారు. కిశోర వికాసం పేరిట కిశోర బాలికలకు వేసవి శిక్షణలో భాగంగా మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెల్‌ఫోన్ వాడకం, ఆన్‌లైన్ మోసాలపై బాలికలకు అవగాహన కల్పించామని చెప్పారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే, ఏఎన్‌ఎంలు, ఆశ, కిశోర బాలికలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నిండిపోయిన కాలువలు



సూర్యతేజానగర్‌లో కంపుకొడుతున్న కాలువ

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పరిధి సూర్యతేజానగర్‌లో కాలువలు కంపుకొడుతున్నాయి. ఇక్కడ కాలువలు చెత్తతో నిండిపోవడంతో వాడుక నీరు సైతం కిందకు పోయే మార్గాలు మూసుకుపోతున్నాయి. ఇక్కడ ప్రధాన రహదారి ఫుట్‌పాత్‌ను ఆనుకొని ఉన్న కాలువను స్థానికులు డెస్ట్‌బిన్‌గా ఉపయోగించుకుంటున్నారు. దీనిలో వేసిన ప్లాస్టిక్ బాటిళ్లు, పాలిథిన్ కవర్లు, పేపర్ ప్లేట్లు నిల్వ ఉండిపోయాయి. దీంతో ఇందులో పేరుకుపోయిన చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఓ పక్క దుర్వాసనతో పాటు ఈ కాలువ గట్టులపై పిచ్చి మొక్కలు ఉండటంతో దోమలు బాధతో ఇబ్బంది పడుతున్నామని నివాసితులు అంటున్నారు. ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న ఈ కాలువలో చెత్తను పారిశుధ్య సిబ్బంది తొలగించకుండా వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ కాలనీలో అన్ని వీధుల్లోను కాలువలో ఇదే పరిస్థితి ఉంది. ఇక్కడ కాలువలు శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దారులన్నీ చీకటిమయం



వెలగని విద్యుత్ దీపాలు

బీచ్‌రోడ్డు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన అందమైన రహదారులు ఇప్పుడు అంధకారంలో మగ్గుతున్నాయి. కరకచెట్టు పోలమాంబ దేవాలయం నుంచి వీఎంఆర్‌డీఏ పార్కు వైపు మార్గాన్ని ఎంతో చక్కగా తీర్చిదిద్దారు. చక్కని విద్యుత్ దీపాలను అమర్చినా.. అవి వెలగకపోవడంతో మార్గం అంతా చీకటిగా ఉంటోంది. ఈ మార్గంలో సాయంత్రం సమయాల్లో నగర యువత ఫొటో షూట్ తీసుకుంటారు, ఇప్పుడు ఆ అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాసులిచ్చుకో.. బడ్డీ పెట్టుకో..



దీన్‌దయాల్‌పురం కూడలి వద్ద ఫుట్‌పాత్ పక్కన టీడీపీ నాయకులు ఏర్పాటు చేయించిన కంటైనర్ బడ్డీ



బడ్డీ వెనుక భాగంలో అమర్చిన కరెంట్ మీటర్

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డులో టీడీపీ నాయకుల అక్రమాలకు అడ్డు లేకుండాపోతోంది. ప్రభుత్వ స్థలాలను విక్రయించడం, వాటిలో పేదల పేరుతో ఇళ్లు నిర్మించడం, రోడ్డు పక్కన ఖాళీ స్థలాల్లో బడ్డీలు పెట్టించి సొమ్ము చేసుకోవడమే రోజువారీ కార్యకలాపాలుగా పెట్టుకున్నారు. ఎస్.ఎస్.ఎన్. నగర్‌లో సుమారు 100 చదరపు గజాల ప్రభుత్వ స్థలాన్ని ఇటీవల విక్రయించి జోన్–2 టౌన్ ప్లానింగ్ అధికారులను ప్రసన్నం చేసుకుని దర్జాగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పుడు బీఆర్‌టీఎస్ రోడ్డులో దీన్‌దయాల్‌పురం కూడలి వద్ద ఫుట్‌పాత్ పక్కనే వార్డు టీడీపీ నాయకులు ఓ వ్యక్తితో కంటైనర్ బడ్డీ పెట్టించారు. ఆ కంటైనర్ పెట్టించినందుకు సుమారు రూ.లక్ష తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీ అధికారులను మేనేజ్ చేయడం, కరెంట్ మీటర్ వేయడం, ఇంకెవరి సమస్య లేకుండా చూసుకోవడం వంటి వాటికి టీడీపీ నాయకులు రూ.లక్ష తీసుకున్నారని బడ్డీ పెట్టుకొన్న వ్యక్తే సచివాలయ సిబ్బంది వద్ద మంగళవారం మొర పెట్టుకున్నట్లు తెలిసింది.

ఆగమేఘాలపై విద్యుత్ మీటర్

ఇదిలా ఉండగా ఆరిలోవ విద్యుత్ శాఖ అధికారులు ఆగమేఘాలపై ఆ కంటైనర్‌కు కరెంట్ మీటర్ అమర్చేశారు. ఎవరూ చూడకుండా కంటైనర్ వెనుక భాగంలో కరెంట్ మీటర్ అమర్చి, అందుబాటులో ఉన్న విద్యుత్ స్తంభానికి కనెక్షన్ ఇవ్వడం కోసం విద్యుత్ తీగలు సిద్ధం చేసి ఉంచారు. సాధారణంగా అధికారికంగా నిర్మించిన ఇంటికి విద్యుత్ మీటర్ కోసం వెళ్లే ప్రజలను వారాల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పించుకునే ఆ శాఖ అధికారులు రెండు రోజుల్లోనే ఈ కంటైనర్‌కు కరెంట్ మీటర్ అమర్చడంపై స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

భలే మంచి రో‘జూ’



ఆకలి వేస్తుంది ఆహారం పెట్టు : నోరు తెరిచిన నీటి ఏనుగు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూపార్క్ కళకళలాడింది. ఒకవైపు చిన్నారులు విత్తన బంతులు వేస్తూ సందడి చేస్తుంటే, సందర్శకులతో జూ అంతా కోలాహలంగా మారింది. జూలో జంతువుల చేష్టలు చూపరులను కట్టిపడేశాయి. ఏనుగులు తొండంతో గోడ దగ్గరకు రావడంతో పిల్లలు కేరింతలు కొట్టారు. వాతావరణం చల్లగా ఉండడంతో జంతువులు మరింత ఉత్సాహంగా కనిపించాయి. ఖడ్గమృగం నీటిలో మునిగి తేలుతూ ఉంటే, ఒడ్డున నిలబడిన రంగుల పెయింటెడ్ స్టార్క్స్ పక్షులు చేపల కోసం గంటల తరబడి ఎదురుచూడటం ఆసక్తికరంగా అనిపించింది. మరోవైపు ఆహారం తీసుకొచ్చిన జూ సిబ్బందిని చూడగానే నీటి ఏనుగు నోరు తెరిచి ఆకలిగా ఉందని సైగలు చేస్తూ అందరినీ నవ్వించింది. ఇక మొసళ్ల కొలనులోనైతే అసలు సిసలు పోటీ ఏర్పడింది. సిబ్బంది వేసిన చేపల కోసం ఘరియల్ (మొసళ్లు), కొంగలు పోటీ పడి ఎవరికి దొరికితే వారిది అన్నట్లుగా ఎదురుచూశాయి. మొత్తానికి ఇందిరాగాంధీ జూపార్క్ సందర్శకులకు మంచి వినోదాన్ని పంచింది.



నోట కరిచిన చేపతో ఘరియల్



ఎవరికి దొరికితే వారికే చేప : పోటీ పడుతున్న ఘరియల్, కొంగ



ఖడ్గమృగం కొలనులో చేపల కోసం వెదుకుతున్న పెయింటెడ్ స్టార్క్స్ పక్షులు